మంచి కవితతో కొంచెం సేపు

విన్నకోట రవిశంకర్



# చిల్మన్

## నెలనెలా ఒక మంచి కవితాపరిచయం

ఈ మధ్య ఇండియా వెళ్ళివచ్చిన తెలుగువారెవరైనా హైదరాబాదు ఎలా మారిపోయిందో ఆశ్చర్యంతో వర్ణించటం పరిపాటి. ఇరవై ఒకటవ శతాబ్దంలో అడుగు పెడుతున్న భారతదేశానికి ప్రతీకగా, హైదరాబాదు రూపొందిందనే విశ్వాసం వారి మాటల్లో వ్యక్తమౌతుంది. అభివృద్ధికి బాహ్య సూచికలుగా నక్లెస్ రోడ్డూ, పెద్ద పెద్ద షాపింగ్ మాల్సు, ఐ మాక్సులు ఇటువంటివి కనిపిస్తే, అంతర్గతంగా జనాల స్వభావం, అలవాట్లలో వస్తున్న మార్పులు కనిపిస్తాయి. ప్రపంచమంతటా దీనినే అభివృధిగా పరిగణిస్తున్నారు కాబట్టి, అనేకమందిలో ఈ మార్పుల పట్ల ఆనందమే వ్యక్తమౌతుంది. ఐతే, దీనికి భిన్నంగా స్పందించేవారు కూడా ఉంటారు. వీరు పాత హైదరాబాదులోనే పుట్టి, పెరిగి, అప్పటి సంస్కృతితో మమేకమై, దానినే పలుమార్లు తలుచుకుని పలవరించేవారు. వీరు నిజమైన హైదరాబాదీలు. అటువంటి వారిలో ఆశారాజు కూడా ఒకరు.

ఆయన రాసిన కవిత "చిల్మన్" ఒక భిన్నమైన స్పందనకి ఉదాహరణ. గతంతో పోలిస్తే హైదరాబదులో ఏమి ఉందో అని కాకుండా, ఏమి లేదో ఈ కవిత వివరిస్తుంది. శిధిలమైన ఒక సంస్కృతిని కరుణాత్మకంగా వర్ణిస్తుంది. ఈ కవిత ఇదే పేరుతో వెలువడిన ఆయన కవితా సంకలనంలో దొరుకుతుంది.

ఈ కవితలో ప్రస్తావించిన సాంస్కృతిక చిహ్నాలన్నీ ఇస్లామీయ సంస్కృతికి సంబంధించినవి. అందులోని కొన్ని సున్నితమైన, సౌందర్యాత్మకమైన ప్రతీకల్ని అది పేర్కొంటుంది. మఖ్మలీ రాత్రులు, పూల బజార్లు, జలతారు తీగలు, రూమీ టోపీ బాబా, చిల్మన్ లు, మల్లెపూల తోరణాలు - వంటి ప్రతీకలు అప్పటి దృశ్యాన్ని మన కళ్ళకు కడతాయి. సంస్కృతి శిధిలం కావటాన్ని సూచించే ప్రతీకలు కూడా అంతే బలమైనవి - హరివిల్లు విరిగి మూసీ నదిలో పడటం, ముక్కూ చెవులు లేని శిల్ప శకలాలు మిగలటం, ఏ రాయికిందో పడి వొగల్దాను పగిలిపోవటం, కోట దర్వాజా కూలిపోవటం వంటివి. ఇప్పుడు "తబలా భాష తెలిసిన హృదయాలు లేవు" అన్నప్పుడు అది కేవలం అప్పటి సంగీతాన్నే గాక, సంస్కృతి మొత్తాన్నీ సూచిస్తుంది.

అశారాజు మొదటి కవితా సంకలనం "నేపథ్యం" లో అడుగడుగునా చిక్కని కవిత్వం నిండి ఉంటుంది. అతి సులభంగా అందమైన పదచిత్రాలు కట్టటం ఆయన ప్రత్యేకత. ఉదయాన్ని వర్ణిస్తూ ప్రతి ఇంటిముందూ పాల ప్యాకెట్లు కుందేలు పిల్లల్లా ముడుచుకు కూర్చుంటాయని , రాత్రి దృశ్యాన్ని వర్ణిస్తూ ఒకామె రాత్రిని రిక్షాలో వేసుకు వెళుతూ ఉంటుందనీ చెప్పేలాంటి గుర్తుండిపోయే పదచిత్రాలెన్నో అందులోని కవితల్లో ఉన్నాయి.

ఐతే, మరీ విరివిగా రాయటం వల్లనో ఏమో, తరువాత ఆయన కవిత్వంలో కొన్ని చోట్ల సాంద్రత కొరవడిందని అనిపిస్తుంది. ఈ కవితలో చాలా మంచి కవిత్వం పలికింది. బహుశ, తనకు బాగా ఇష్టమైన హైదరాబాదు గురించి, తనకు పరిచితమైన అనుభవాల గురించి స్పందిస్తూ రాయటం వలన కావచ్చు. నగరం గురించి చెప్పే ఈ క్రింది పదచిత్రంలో కవిగా ఆయన ప్రతిభ కనిపిస్తుంది:

నేలకు దిగిన తారలతో
అలాలు పొంగే పాటలతో
మల్లెపూల తోరణాలతో
నగరమొక కదిలే పడవ
నది పక్కన జరిగే ఉరుసు

ఈ కవితలో గతించిన సంస్కృతికి సంబంధించిన స్మృతి, అది లేకపోయిందన్న చింత తప్పించి, దానికి ప్రతిగా వచ్చిన ఆధునిక సంస్కృతితో పోలిక ఎక్కడా చెప్పలేదు. ఇది మంచిదే అనుకుంటాను. దీనివల్ల కవితకు ఏకసూత్రత ఏర్పడి, బిగువైన కవితగా రూపొందింది. వేరే ఏ అంశాలు కవితలో చేరినా, ఈ సమగ్రత ఉండేది కాదు.

హైదరాబాదు చరిత్ర, కొన్ని స్థల పురాణాలతో సహా అక్కడ జరిగిన రాజకీయ పరిణామాలు వివరించే పుస్తకం ఒకటి ఈ మధ్య చదివాను. అది లోకేశ్వర్ రాసిన "సలాం హైదరాబాద్". నవలగా చెప్పబడినా, అది ఒక క్రానికల్ లాగానే అనిపిస్తుంది. హైదరాబాద్ గురించి తెలియని ఎన్నో విశేషాలు ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. హైదరాబాద్ ను ప్రేమించేవారందరూ తప్పక చదవవలసిన పుస్తకం అది.

మనం ఒప్పుకున్నా లేకపోయినా, అభివృద్ధి పేరిట జరిగే మార్పులు జరుగుతూనే ఉంటాయి. ఐతే, ఇటువంటి కరుణాత్మకమైన కవితలు చదివినప్పుడు, మన మనసులు కదిలి, పురాస్మృతుల పరిమళాలు చుట్టూరా అల్లుకుంటాయి. ఇటీవలి దాడుల్లో గాయపడిన నగరానికి ఈ కవిత ఒకప్పటి సాంస్కృతీ వైభవాన్ని గుర్తుచేస్తుంది. నాలుగువందల సంవత్సరాల మహా నగరం కోసం కన్నీటి ముత్యాలతో కూర్చిన హారం ఈ కవిత.

**కవిత పూర్తి పాఠం:**

ఆ వైభవం లేదు
మఖ్ మలీ రాత్రులు లేవు
దుమ్ములో కలిసిన
సీతాకోక చిలుకల రెక్కలు వెదికి
ఒక స్వప్నాన్ని చూద్దామా!
పూల బజార్లనీ
జలతారు తీగల్నీ
గజ్జెల వెండికాలిపట్టాల్నీ
మాడి మసైపోయిన
బూడిద కుప్పలో వెదికి చూద్దామా!

పచ్చమేడ బాటపక్కన
బాదంచెట్టు ఉండేది
చెట్టు కింద రూమీ టోపీ బాబా కూర్చునేవాడు
కళ్ళు కనబడకపోయినా
ఆ వీధిని వర్ణించి పాడేవాడు

ఇప్పుడు పరిమళాలు లేవు
పూలదండ పొగచూరింది
హరివిల్లు లేదు
విరిగి మూసీనదిలో పడింది
చిల్మన్ ల చాటున
వెన్నెల బొమ్మల్లేవు
స్తనం మీద రవిక చిరిగి
ఈగలు ముసురుతున్నాయి
వయసులేదు
శరీరం లేదు
ఆరోగ్యం లేదు
ముక్కూ చెవులూ లేని
శిల్ప శకలాలు మిగిలాయి

నేలకు దిగిన తారలతో
అలాలు పొంగే పాటలతో
మల్లెపూల తోరణాలతో
నగరమొక కదిలే పడవ
నది పక్కన జరిగే ఉరుసు

ఇప్పుడు
చిరునామా లేదు
వెల్తురు లేదు
జనం అపరిచితులు
సలాం చేస్తే

చేతి గాజులు
మీటిన సితారు తీగలు
పలుకరిస్తే
మనసునిండే
పాను సుగంధాలు
ఇప్పుడు
ఏ రాయి కిందో పడి
వొగ ల్దాను పగిలిపోయింది
కోట గర్వాజా కూలి
గోరింటాకు చేతులు చితికి
అద్దం మీద గాయం మిగిలింది
ముఖమంతా నెత్తురయింది



ఇప్పుడు
వాళ్ళ ఆకాశం లేదు
వాళ్ళ చందమామ లేదు
తబలా భాష తెలిసిన
హృదయాలు లేవు
నవుల సంస్కారం వినే
ప్రేమికులు లేరు
సంస్కృతిని తారీఫ్ చేయటానికి
ఒక కాబిల్ ఇన్సాన్ లేదు
ఖబరస్తానే మిగిలింది
ప్రేమతో
ఓ కొవ్వొత్తి వెలిగిద్దాం రండి !
ఒక అన్నం ముద్ద తినిపించి
కౌగలించుకొందాం రండి !

-ఆశారాజు